హర హర మహాదేవ

● జిల్లాలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు ● భక్తజన సంద్రంగా కోటిలింగాల ● దుబ్బరాజన్న ఆలయంలో రద్దీ



వెల్గటూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలు జిల్లాలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం కోటిలింగాల శ్రీ పార్వ తీ కోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. పరిసర గ్రామాల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వేలా దిగా తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనంకు వేరు వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామి వారికి అర్చన, అభిషేకాదులు నిర్వహిం చారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులచే ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగ కుండా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు తెలం గాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో సముద్రాల రమేష్ గుప్తా మజ్జిగ పంపిణీ చేశారు. మండలం లోని ముత్తునూర్ ముక్తేశ్వర స్వామి, వెంకటాపూర్‌లోని స్వయంభుః కట్ట రాజేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ట్రాఫిక్ సమస్య నివారణకు పటిష్ట చర్యలు

మహాశివ రాత్రి సందర్భంగా కోటిలింగాలకు వాహనాలపై తరలి వచ్చే భక్తులకు ప్రతీ ఏటా ట్రాఫిక్ సమస్య పోలీసులకు ఓ సవాల్‌గా మారేది. భక్తులు వాహనాలపై కిలో మీటర్ దూ రం నుంచే ఇబ్బంది పడేవారు. ధర్మపురి ఎమ్మెల్యే విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు సీఐరాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్‌లు పోలీస్ సిబ్బందిని..

మిగతా 8లో



భక్తజనంతో కిక్కిరిసిన దుబ్బరాజన్న క్షేత్రం



కోటిలింగాల వద్ద గోదావరిలో భక్తుల స్నానాలు



కోటిలింగాలలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



దుబ్బరాజన్న ఆలయంలో భక్తులు

భక్తజన సంద్రం

వేములవాడ క్షేత్రం



విద్యుత్ కాంతుల మధ్య వెలిగిపోతున్న వేములవాడ రాజన్న ఆలయం



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ క్షేత్రం బుధవారం శివనామస్మరణతో మారుమోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వివరాలు 7లో...

మండలాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వెల్గటూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 9 మంది టీచర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పా టు చేశారు. 882 మంది పట్టభద్రులకు 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ శేఖర్ పరిశీలించారు.

● **కొడిమ్యాల:** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగుకు మండల కేంద్రంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయినట్లు సెక్టార్ ఆఫీసర్ మునీందర్ బుధవారం సాయంత్రం తెలిపారు.

● **మల్యాల:** మల్యాల మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠ శాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలోని మూడు కేంద్రాలలో 1993 మంది ఓటు హక్కు విని యోగించుకోనున్నారు.

● **బీర్‌పూర్ :** మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠ శాలలో ఎమ్మెల్సీ ఓటింగ్ కోసం రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. సెక్టోరల్ అధికారి ముంతాజుద్దిన్, రూట్ ఆఫిసర్ శ్రీనివాస్‌లు పరిశీలించారు. పోలింగ్ కోసం ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారని సెక్టోరల్ అధికారి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల రాస్తారోకో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీలత



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

కోరుట్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధ వారం అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థులు రాస్తారోకో చేశారు. కళాశాలలో ఉపన్యాసకులు సరిగా లేకపో వడంతో పాటు తరగతి గుదులు సరిగా లేవని, మరు గుదొడ్లు పూర్తిగా చెడిపోయి ఉన్నాయని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కోరుట్ల వేములవాడ రహదారిపై నిరసన తెలిపారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని చేరుకుని ఆందోళన విరమిం పజేశారు. అనంతరం కళాశాల గేట్ వద్ద విద్యార్థులు మరోమారు నిరసనకు దిగారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని తెలుపడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

భారీగా నిలిచిపోయిన వాహనాలు

కోరుట్ల వేములవాడ రోడ్డుపై విద్యార్థులు రాస్తా రోకో చేయడంతో పండగపూట ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాజన్న దర్శనానికి వెళ్తున్న ప్రయాణికులు రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడకు భారీ సంఖ్యలో భక్తులు ఆర్‌టీసీ బస్సులు, వాహనాల్లో వెళ్తుండగా రాస్తా రోకోతో నిలిచిపోయాయి. సుమారు గంట పాటు విద్యార్థులు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను అధికారులు, సిబ్బంది సమర్థ వంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూ షన్, రిసెప్షన్ సెంటర్‌ను ఆయన సందర్శించి పరిశీలన జరిపారు. ఎన్నికల సమాగ్రితో తరలివెళ్తున్న ఉద్యోగులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం అను మతించిన గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానికి గుర్తుగా చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతతో 144 సెక్షన్ అమ లులో ఉంటుందన్నారు. జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ, పట్టభ ద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగు తుందన్నారు. జిల్లాలో 12 సెక్టార్లలో ప్రతి రూట్ బ్యాలెట్ బాక్సులు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, ఆర్‌డీఓలు, ఎన్నికల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

కోరుట్లలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

కోరుట్ల: ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నియమావళి పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 8 గంటల నుంచి సాయత్రం 4 గంటల వరకు పోలింగ్ స్టేషన్‌లతో పాటు పట్టణంలో 144 సెక్షన్ అములులో ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ కిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● నేడు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

● జిల్లాలో పట్టభద్ర ఓటర్లు 35,281, పోలింగ్ స్టేషన్లు 51

● ఉపాధ్యాయ ఓటర్లు 1,769, పోలింగ్ స్టేషన్లు...20

జగిత్యాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పా ట్లు పూర్తి చేసింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజక వర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమా రం మండలాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రి బ్యూషన్, రిసెప్షెన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రిని తీసుకొని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సిబ్బందికి వారికి కేటాయించిన నిర్ణీత పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అవసరమైన ఏర్పాటు పూర్తి చేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగునీరు బయోటాయి లెట్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఇప్పటికే ఓటరు స్లిప్పు ల పంపిణీ పూర్తయింది. ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల కొరకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి(పీఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్లు)కు రెండు విడతల శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పరిచారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఇన్, అవుట్ సబ్‌కాస్టింగ్

పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన నిఘా ఉంచారు. పోలింగ్ కేంద్రంలో ఇన్, అవుట్ సబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం బయట క్యూ పరిశీలించడానికి వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించడానికి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.



పోలింగ్ సామగ్రితో తరలివెళ్తున్న సిబ్బంది



గ్రాడ్యుయేట్ ఓటర్లు : 35,281

జిల్లా వ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు 35,281 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 21,667, స్త్రీలు 13,614 మంది ఉన్నారు. పట్టభ ద్రులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 51 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో అత్యధికంగా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రూమ్ నంబరు 26లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 949 మంది ఓటర్లు, రూమ్ నంబరు 27లోని పోలింగ్ కేంద్రంలో 941 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ బ్లాక్ రూమ్ నంబరు 3లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 373 మంది ఓటర్లు, వెల్గటూరులోని జడ్పీహైస్కూల్ రూమ్ 2లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 409 మంది ఓటర్లున్నారు.

ఉపాధ్యాయ ఓటర్లు : 1,769

జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు 1,769 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,232 మంది, స్త్రీలు 537 మంది ఉన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ప్రత్యేకంగా 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 677 మంది ఓటర్లు, కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల రూమ్ నంబరు 30లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 326 మంది ఓటర్లు, అత్యల్పంగా బీమారం జడ్పీ హైస్కూల్‌లో 9 మంది ఓటర్లు, వెల్గటూరులో జడ్పీ హైస్కూల్ రూమ్ నంబరు 2లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 9 మంది ఓటర్లున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లు : 548

జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో 548 పోస్టల్ బ్యాలెట్స్ ఉన్నాయి. ఇందులో 65 మంది పీఓలు, 65 మంది ఏపీఓలు, 160 మంది ఓపీఓలు, 180 మంది పోలీసు సిబ్బంది, 28 మంది మైక్రో అబ్జర్వర్లు, 50 ఇతర అధికారులున్నారు. కాగా ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటూ ఫారం 12ను 324 మంది నుంచి అందినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు చేపట్టి నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో గురువారం నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్ని కల్లో విధులు, బాధ్యతలు తదితర అంశాలపై పోలీస్ అధికా రులు, సిబ్బందితో ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటు హక్కు విని యోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసరపు విషయాలు చర్చించవద్దన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధి కారుల ఆదేశాలు లేనిదే సిబ్బంది విధులు నుంచి వెళ్లరాద న్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలో 71 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా 233 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ సరళితో పాటు భద్రత పరమైన చర్యల కోసం 12 రూట్లు ఏర్పాటు చేశామని, ఇద్దరు డీఎస్పీలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఆరుగురు సీఐలతో మరో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎస్సైలతో 18 పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘుచందర్, రాములు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, సీఐలు రాంనర్సింహారెడ్డి, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, ఆర్‌ఐలు కిరణ్‌కుమార్ ఉన్నారు.



బ్యాలెట్ బాక్స్‌లు తరలిస్తున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల నిర్వహణ కోసం పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లు తరలించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొ న్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



కరీంనగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సామగ్రితో వెళుతున్న సిబ్బంది





పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటూ..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వంసిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు బుధవారం బయలుదేరారు. నియోజవర్గ పరిధిలోని 15 జిల్లాల్లో 773 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తారు.





సిరిసిల్లలో..



జగిత్యాలలో..



పెద్దపల్లిలో..







కరీంనగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది, పెద్దపల్లి, సిరిసిల్లలో పోలింగ్ కేంద్రాల వివరాలను సరి చూసుకుంటున్న సిబ్బంది, కరీంనగర్‌లో పోలింగ్ సామగ్రితో మహిళా సిబ్బంది

విద్యార్థి ఆత్మహత్య

● చిన్నమెట్‌పల్లిలో పండుగపూట విషాదం



సంజయ్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పండగపూట మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలో విషాదం నింపింది. పరీక్షలో ఫెయిల్ అవుతాననే అనుమానంతో బుధవారం ఓవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోతూరి వెంకటేష్-లత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన సంజయ్(19) కల్లూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి వెంకటేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. లత తన కుమారులతో చిన్నమెట్‌పల్లిలో నివాసం ఉంటోంది. సంజయ్ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఫెల్ అయినట్లు తెలిపారు. ఈ విషయంలో సంజయ్ మనోవేదనకు గురయ్యేవాడు. శివరాత్రి రోజు తల్లి రాయికల్ మండలంలో జరిగే వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లగా సంజయ్ ఇంటి వద్ద ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం లత ఇంటికి చేరుకుని చూడగా సంజయ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సంజయ్ తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సంజయ్ మృతితో పండగపూట గ్రామంలో విషాదం నెలకొంది.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



ధర్మయ్య గౌడ్(ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగపల్లి గ్రామంలో తాటి చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందడంతో పండగపూట గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ కథనం ప్రకారం.. జంగపల్లి గ్రామానికి చెందిన ముత్యం ధర్మయ్యగౌడ్(59) వృత్తిరీత్యా గీత కార్మికుడు. రోజువారీ లాగే బుధవారం కల్లు గీసేందుకు తాటిచెట్టును ఎక్కి ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం జిల్లాఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లపట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాలగల స్థలంలో బుధవారం 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు ఎరుపు రంగు టీషర్టు, బ్లూరంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురీగదికి తరలించి భద్రపరిచారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిపై దాడిచేసిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పవన్ సాయి, రోషన్, దీక్షిత అనే చిన్నారులతో పాటు దాసరి అమృత, ఎడ్ల సత్తయ్యలపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. బాధితులను చికిత్స నిమిత్తం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి శివారులో బుధవారం పేకాట శిబిరంపై ఎస్‌ఐ వెంకటేష్ దాడి చేశారు. ఇద్దరు పట్టుబడగా ఐదుగురు పారిపోయినట్ల ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.30,240, మూడు సెల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులో కేబుల్స్, బ్యాటరీల చోరీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఆవరణలో ఉన్న వైర్ల బండల్స్, బ్యాటరీలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు కార్యాలయ బాధ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం బాధ్యులు ఫిర్యాదు చేశారు. వైర్ల బెండిల్స్ అరవైవేల రూపాయల విలువ ఉంటుందని, బ్యాటరీలు ఇరవైవేల రూపాయల విలువ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక ఫిబ్రవరి 26: మండలంలోని కనపర్తి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్ తరలించారు. కోర్కల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొలిపాక శ్రీదర్ సుద్దాల దేవడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటరీయిల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందికి పలు ఆదేశాలు, సూచనలు చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్‌పై రూట్ ఆఫీసర్లతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టమ్, సీలింగ్‌పై అవగాహన కల్పించారు. పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకోవాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 71,545 మంది పట్టభద్రుల ఓటర్లు, 4,305 మంది టీచర్లు ఓటర్లు ఉన్నారని అన్నారు. వీరి కోసం జిల్లాలో 103 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, కరీంనగర్ రెవెన్యూ డివి జన్‌లో 69 గ్రాడ్యుయేట్, 12టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 16 గ్రాడ్యుయేట్, 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటు హక్కు కలిగిన వారు ఓటరు గుర్తింపు కార్డుతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకదానినిచూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన పసుల మంజుల అనే రాజన్న భక్తురాలి మెడలో నుంచి అగంతకులు పుస్తెలతాడు లాక్కెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి కాలినడకన చంద్రంపేట నుంచి వెళుతున్న మంజుల అనే భక్తురాలిని ద్విచక్రవాహనంపై వెంబడించిన ఇద్దరు అగంతకులు అగ్రహారం సమీపంలోని గుర్రవానిపల్లె వద్ద అటకాయించి ఆమె మెడలోనుంచి 3తులాల పుస్తెల తాడును లాక్కెళ్లారని బాధితురాలు పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల మధ్య అగంతకుల కోసం గాలింపులు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా అగంతకులను గుర్తించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జగిత్యాల ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్‌జడ్జి ఎస్ నారాయణ

గొల్లపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని గొల్లపల్లి మండలం రాపల్లె గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. పోటీలను జగిత్యాల ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జ్ ఎస్ నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన 17ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన దెబ్బెట సాయివెంకటి ప్రథమ విజేతగానిలిచి దాత శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయకమిటీ అందించిన పావుతులం బంగారం కైవసం చేసుకున్నాడు. రెండో విజేతగా మండలంలోని వెన్గుమట్ల గ్రామానికి చెందిన నేరెళ్ల నరేష్ గౌడ్ నిలిచి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ అందించిన 10తులాల వెండి గెలుచుకున్నాడు. తృతీయ బహుమతిగా గ్రామ తాజామాజీ సర్పంచ్ నల్ల శ్యామ్-రాజమణి దంపతులు అందించిన 5 తులాల వెండిని ఎండపెల్లి మండలం చర్లపెల్లి గ్రామానికి చెందిన మాదాసు వెంకటశివ గెలుచుకున్నాడు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విజేతలకు బహుమతులను ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మారంపల్లి బాబు, నల్ల శ్యామ్, కొక్కుల భూమయ్య, గండ్ర సత్యంరావు, నాయకులు సత్యానారాయణ గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్, రాములు, వినోద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో భక్తుడిని కాపాడిన ఎస్సై



భక్తుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై రమేష్

ఓదెల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు వచ్చిన భక్తుడు ఆకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలడంతో వెంటనే పొత్కపల్లి ఎస్‌ఐ స్పందించి సీపీఆర్ చేసి కాపాడాడు. ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం శివరాత్రి వేడుకలకు వీణవంక మండలం చల్లూర్ గ్రామంనుంచి వాహనంలో భక్తులు హాజరయ్యారు. పూజలు, దర్శనం పూర్తి కాగా మరోకొద్ది సమయంలో తిరుగు ప్రయాణంలో ఉండగా చల్లూర్‌కు చెందిన ఓర్సు శ్రీనివాస్ గుండెపోటుతో కుప్పకూలాడు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ వెంటనే సీపీఆర్ చేసి రక్షించాడు. అనంతరం ప్రాథమిక చికిత్స చేసి అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఎండుతున్న పంటపొలాలు

● అడుగంటిన భూగర్భ జలాలు ● ఎడారిని తలపిస్తున్న వాగులు ● జీవాలకు మేతగా వరిపొలాలు



సిరిసిల్ల: పెద్దూర్‌లో వరిపంటను మేస్తున్న గొర్రెలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని పలుగ్రామాల్లో పచ్చని పొలాలు నీరులేక నెర్రెలు వారుతున్నాయి. యాసంగికి ఎంతో సంతోషంగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. కానీ వేసవికాలం కూడా రానే లేదు.. అప్పుడేపొలాలు బీటలు వారుతున్నాయి. సాగునీరు అందక పచ్చని పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు బోరుమంటున్నాయని సాగు నీరందించాలని అధికారులను రైతులు వేడుకుంటున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మోతె, ఇరుకుళ్ల, మానేరు వాగుల్లో నీరులేకపోవడంతో పొలాలకునీరు అందడం లేదు. వాగుల్లోని వ్యవసాయ బావులు అడుగంటి పోతున్నాయి. ఎల్లంపల్లి, లోయర్ మానేరుడ్యాం, కొత్తపల్లి చెరువు, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల చేయడం లేదు. దీంతో పొలాలు ఎండిపోగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, మొగ్దుంపూర్, నగునూర్, ఎలబోతారం, గోపాల్‌పూర్, దుర్శేడ్, నల్లగుంటపల్లి, మందులపల్లి గ్రామాల్లో సాగునీరుకు తీవ్రంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొట్ట దశకు చేరిన సమయంలో నీటి విడుదల లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎస్సారెస్పీ నీరు కూడా సరిగా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోతె, ఇరుకుల్ల, మానేరు వాగు పూర్తిఎడారిగా మారడంతో పక్కనే బోరుబావుల్లో కూడా నీరులేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు రైతులకు చెందిన దాదాపు 100ఎకరాలకు పైబడి పంటలు ఎండిపోయాయి. వరి, మొక్కజొన్నపంటలు నీరందక ఎండిపోతున్నాయి. వెంటనే మోతె వాగులోకి నీరు విడుదలచేస్తే ఇరుకుల్ల, మానేరువాగు నీరుచేరి భూగర్భజలాలు పెరగడంతోపాటు బావుల్లో నీటిమట్టం పెరిగి పంటలను రక్షించుకోవచ్చని లేకుంటే పూర్తిగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సాగునీటి సమస్యలు తీర్చాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.



కరీంనగర్ రూరల్ : మందలపల్లిలో నీరు లేక ఎండిన మొక్క జొన్న పంట

రామడుగు: ఓవైపు మండలంలో వరద కాలువ.. గ్రావిటికెనాల్.. మరోవైపు ఎల్లంపల్లి పైపులైన్ ఉన్నప్పటికీ పంటలకు చుక్కనీరు అందడంలేదు. మండలంలోని షానగర్, కోరటపల్లి, మోతె గ్రామాల్లో సాగు నీరు అందక 200ఎకరాల్లో పొట్ట దశకు చేరుకున్న పంటలు ఎండిపోయే పరిస్థితిఏర్పడింది. మరో రెండు మూడు రోజులు పరిస్థితిఇలాగే కొనసాగితే పెద్దసంఖ్యలో పంటలు ఎండిపోయేపరిస్థితి ఏర్పడు తుందని రైతులుగగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి యుద్ధప్రతిపాదికన ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా రిజర్వాయర్‌లోనికి నీటిని వదిలి అక్కడనుంచి నేరుగా మోతేవాగుకు నీటిని అందిస్తే తప్ప పంటలు తడిసే అవకాశంలేకుండా పోతుందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెలకు మేతగా మారిన వరి పంట..

సిరిసిల్ల రూరల్: సిరిసిల్లలో నీళ్లలేక ఎండిపోయిన వరిపంటలు గొర్రెలకు మేతగా మారిపోతున్నాయి. మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని కాలువల్లోకి వదలకపోవడంతో సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ గ్రామంలోని వ్యవసాయ బావుల్లో నీరులేక వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పశువులు, గొర్రెలకు మేతగా వదిలేశారు. పెద్దూర్ గ్రామ శివారులోని ఎద్దుగుట్ట ప్రాంతంలో ఉన్న కాసారం నర్సయ్యకు చెందిన రెండు ఎకరాలను గ్రామానికి చెందిన సలేంద్రి మల్లయ్య అనే రైతు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేకపోవడంతో గొర్రెలకు మేతగా వదిలేశారు. గ్రామానికి చెందిన తమ్మెట జీవన్‌కు చెందిన రెండు ఎకరాలు, సలేంద్రి మల్లయ్యకు చెందిన మూడు ఎకరాలు, గుర్రం నర్సయ్యకు చెందిన రెండు ఎకరాలు సైతం గొర్రెలకు మేతగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మల్కపేట రిజ్వాయర్ నుంచి నీటిని చెరువుల్లోకి నింపి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.







కరీంనగర్ రూరల్ : చామనపల్లి, ఇరుకుల్ల, మొగ్దుంపూర్‌లో ఎండిపోయి బీటలు వారిన వరి, మొక్కజొన్న చేలు



రామడుగు మండలంలో ఎండుతున్న పొలంలో దిగాలుగా కూర్చొని ఆవేధన వ్యక్తం చేస్తున్న రైతు


వేములవాడ ఆలయం ఎదుట భక్తుల రద్దీ


విద్యుద్దీపాల వెలుగులో వేములవాడ రాజన్న క్షేత్రం


వేములవాడలో స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పూజలు

శంభో శంకరా..

- భక్తజన సంద్రంగా వేములవాడ క్షేత్రం
- శివనామ స్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ క్షేత్రం బుధవారం శివనామస్మరణతో మారుమోగింది. స్వామివారిని దర్శించుకుని అభిషేకం చేసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేములవాడ ఆలయంతోపాటు, పట్టణ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి స్థానికులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్నారు. తెల్లవారు జామున మూడు గంటల వరకు భక్తులకు దర్శనం కాకపోవడంతో భక్తులు పోలీసుల తీరుపైన అసహనం వ్యక్తం చేస్తూ పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి భక్తులకు నచ్చజెపి క్యూలైన్ త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు లఘుదర్శనం అమలు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భక్తుల క్యూలైన్‌లు, ధర్మగుండం, ఆలయ పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్, ఎస్పీ క్యూ లైన్లను క్రమబద్ధీకరించి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న శివస్వాముల శోభాయాత్ర...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దీక్ష తీసుకున్న శివస్వాములు పంచామృతాలతో నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. పంచామృతాలను నెత్తిన పెట్టుకుని ఒగ్గుడోలు చప్పుళ్ల మధ్యం, డీజే సౌండ్స్ మధ్య రాజన్న పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. శివస్వాములకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నాలుగు గం టల నుంచి ఐదు గంటల వరకు శివస్వాములకు కేటాయించిన సమయంలో రాజన్న అభిషేక పూజలో పాల్గొని రాత్రి మాలవిరమణ చేశారు.

అలరించిన కళాకారుల నృత్యప్రదర్శన..

శివార్చన వేదిక నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజన్న ఆలయ గుడి చెరువలోని పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన శివార్చన వేదికలో కళాకారులు తమ కళను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు.

ఆలయ ప్రధాన ద్వారానికి తాళం..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ప్రధాన ద్వారానికి పోలీసులు తాళాలు వేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఎవరు లోనికి, వెలుపలికి వెళ్లకుండా తాళం వేయడంతో ఆరుబయటనే భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో పోలీసులు, ఆలయాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై భక్తులు మండిపడ్డారు. విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి వెంటనే ప్రధాన ద్వారా తాళాన్ని తొలగించి భక్తులను లోనికి అనుమతించారు. ఆలయంలోని ఉత్సవ కమిటీ సభ్యులను పోలీసులు అడుగడుగున అడ్డుకోవడంతో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు పోలీసుల తీరుపై అసహనాన్ని వ్యక్తపరుస్తూ తిరిగివెళ్లిపోయినట్లు తెలిసింది.

భక్తి, శ్రద్ధలతో జాగరణ

రాజన్న ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఉపవాసం ఉండి జాగరణ దీపాలను వెలిగించి రాత్రంత పరమశివుడిని ఆరాధిస్తూ జాగరణ చేశారు. పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన స్థలాల్లో పండ్లు, దుంపలు, మక్కసత్తు, గోగిపువ్వులతో అలంకరించి జాగరణ దీపాలు వెలిగించారు. రాత్రంత మెళకువతో జాగరణ చేసి తెల్లవారు జామున వేకువనే ఉపవాస దీక్ష విరమించనున్నట్లు భక్తులు తెలిపారు.

విద్యుత్ కాంతుల్లో రాజన్న ఆలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం విద్యుత్ దీపాలతో వెలుగులు చిమ్ముతూ భక్తులను కనువిందు చేసింది. రాజన్న ఆలయ ప్రధాన గోపురాలతో పాటుగా ఆలయ ప్రహరీకి మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపాలు, ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో పలు రకాల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో రాజన్న ఆలయంతో పాటుగా అనుబంధ ఆలయాలు కాంతులీనుతూ కనిపించాయు.

వైభవంగా మహాలింగార్చన

రాజన్న ఆలయంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రిని పురష్కరించుకుని 128 మంది అనువంశీక బ్రహ్మణ కుటుంబాలు మహా లింగార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్ఛరనల మధ్య లింగాకృతిలో దీపాలను వెలిగించారు. రాత్రి 12 గంటల సమయంలో ఆలయ అర్చకులు స్వామి వారికి లింగోద్భవాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి నుంచి గోదావరి జలాలు తీసుకెళ్తున్న భక్తులు


రాజన్న ఆలయ ఆవరణలో జాగరణ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


మహాలింగార్చన కార్యక్రమంలో పాల్గొన్న అనువంశిక అర్చకులు


కరీంనగర్‌లో శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


దుబ్బరాజన్న క్షేత్రంలో కోడె మొక్కులు చెల్లిస్తున్న భక్తులు




వేములవాడలో భక్తుల క్యూ

మహిమగల దేవుడు వేములవాడ రాజన్న..

కేంద్ర మంత్రి బండి సంజయ్

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వరస్వామి మహి మగల దేవుడని, రాజన్న క్షేత్రం ఎంతో శక్తివంతమైనదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ఆయన వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారన్నారు. మోదీ వేములవాడ రాజన్నను దర్శించుకున్నప్పటి నుంచి దేశవ్యాప్తంగా భక్తులు వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లాలని అనుకుంటున్నారని తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా వేములవాడలో ఏర్పాట్లు చాలా బాగున్నాయని ప్రశంసించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, సెస్ మాజీ అధ్యక్షుడు అల్లాడి రమేష్, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, బండ మల్లేశం, గోపు బాలరాజు ఆయన వెంట ఉన్నారు.

దుబ్బరాజన్న క్షేత్రంలో..

సారంగాపూర్: జగిత్యాల జిలా దుబ్బ రాజన్న ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు స్వామి వారి ధర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న క్షేత్రం భక్త జనసందోహం తో కిటకిటలాడింది.

భక్త జన సంద్రంగా కోటిలింగాల

వెల్గటూర్: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కోటిలింగాల పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామి వారికి అర్చన, అభిషేకాదులు నిర్వహించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

శివనామస్మరణతో మారుమోగిన క్షేత్రాలు

ఓదెల: ఓదెల మండల కేంద్రంలోని భ్రమ రాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో పెద్దపల్లి సివిల్ కోర్టు జూనియర్ జడ్జి మంజుల, అడిషనల్ కలెక్టర్ వేణు, ఏసీపీ గజ్జి కృష్ణతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలం తో పాటు హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాలకు చెందిన భక్తులు ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాగారం చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, లింగోద్భవ కాలంలో గర్భగుడిలో శేషాలింగేశ్వరునికి బిల్వపత్రి సమర్పించారు. భక్తుల కాలక్షేపం కోసం గానలహరి, భజన మండలి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో సదయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


ఓదెల ఆలయంలో అభిషేకం చేస్తున్న పెద్దపల్లి జిల్లా న్యాయాధికారి మంజుల


వేములవాడలో కళాకారుడి ప్రదర్శన




స్వామివారి దర్శనానికి వస్తున్న శివ స్వాములు


కోటిలింగాల ఆలయం వద్ద గోదావరిలో భక్తుల స్నానాలు


భక్తులతో నిండిపోయిన వేములవాడ జాతర గ్రౌండ్

హరహర మహాదేవ

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్న అనంతరం బోటింగ్ చేయడానికి ఉత్సాహం చూపారు. మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా బోటింగ్ సౌకర్యం కల్పించారు.

దుబ్బరాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు

సారంగాపూర్ : జిల్లాలోనే ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ దుబ్బ రాజన్న ఆలయంలో మహాశివ రాత్రి వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. వేకువ జామునుంచే భక్తులు స్వామి వారి ధర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులు అభిషేకాలు, కుంపటి మొక్కులు, కోడెలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళలో భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో రాజన్న క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై దత్తాద్రి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేసి ఉత్సవాలను పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీజేపీ నాయ కురాలు బోగ శ్రావణి దర్శించుకున్నారు.

దుబ్బరాజన్న భక్తుల నిలువు దోపిడీ

● టెండర్ నిబంధనలు బేఖాతర్


అధిక ధరలతో ఏర్పాటు చేసిన బోర్డు

సారంగాపూర్, ఫిబ్రవరి, 26 (ఆంధ్రజ్యోతి): మొదటి రోజే శ్రీ దుబ్బ రాజన్న భక్తులు ఆలయ అధికారుల నిర్లక్ష్యంతో నిలువు దోపిడీకి గురయ్యారు. టెంకాయ, రూ30. బెల్లం రూ, 60 అమ్మాల్సి ఉండగా టెండర్ దక్కించుకున్న నిర్వాహకుడు అధిక ధరలకు టెంకాయ రూ.50, బెల్లం రూ.100కు విక్రయించాడు. దీనిపై భక్తులు వారిని ప్రశ్నించగా ఆలయ అధికారులు అనుమతి ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. ఈ విషయంపై ఆలయ సిబ్బందిని ప్రశ్నించగా దాటవేసే సమాధానం చెప్పారు. ఈవోను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

రాయికల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు వేయడానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ ఖయ్యూం, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆగస్టు 10ని ప్రవాసీ దినంగా ప్రకటించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 10వ తేదీన పి.శివశంకర్ జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రవాసీ దివస్ నిర్వహించాలని ఎన్ఆర్ఐ టీపీసీసీ కన్వీనర్ మంద భీంరెడ్డి ముఖ్యమంత్రికి ఈ-మెయిల్ ద్వారా విన్నవించారు. వివిధ దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలను మాతృభూమికి, తెలంగాణకు అనుసంధానం చేయడంతో వారి సేవలను ప్రభుత్వం గుర్తించి సత్కరించడం, పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వడంపై ఈ అవకాశాన్ని ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు.

నేడు భూషణరావుపేటలో దుర్గాదేవి బోనాల పండగ

కథలాపూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేటలో ఈ నెల 27న దర్గాదేవి బోనాల జాతర నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు


జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం


గుడికోట ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


రాయికల్ శివాలయంలో దావ వసంత పూజలు


ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలో ఉన్న శైవ క్షేత్రాలన్నీ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మార్కండేయ దేవాలయం, గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం, గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం, మడేలేశ్వర స్వామి దేవాలయం, టవర్ సర్కిల్‌లో గల పురాతన శివాలయం, పట్టణంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌలస్తేశ్వర, సహస్రలింగాల ఆలయాల్లో బుధవారం ఘనంగా మహాశిరాత్రి వేడుకలు నిర్వహించారు. భక్తుల దర్శనానికి జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్లు నలుమాసుగంగాధర్, ధర్నేని వెంకటేష్, పౌలస్తేశ్వరస్వామిఆలయ ఈఓ రవికిషన్, జూనియర్ అసిస్టెంట్ కొంద్రరవి, అర్చకులు గోపాల్‌శర్మ, గోవర్ధనశర్మ, ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు. పౌలస్తేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీదేవేందర్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం జీవన్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కుమారుడు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శ్రీ రామలింగేశ్వర స్వామి, క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల శివనామ స్మరణల మధ్య ప్రతిధ్వనించాయి. మండలంలోని నేరెళ్ల సాంబ శివ, శ్రీ రాజరాజేశ్వర, దమ్మన్నపేట శ్రీ వీరభద్ర స్వామి, జైనా శ్రీ రామలింగేశ్వర స్వామి, రాజారం శివాలయాల్లో అర్చకులు మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ధర్మపురిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శివుడికి జలంతో, పాలతో అభిషేకాలు చేయించి బిల్వార్చన జరిపారు. ధర్మపురి శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వరస్వామి, శ్రీ రామ లింగేశ్వర స్వామి, నేరెళ్ల సాంబశివ, రాజారం శివాలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కొడిమ్యాలలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు


గుడికోట ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బోగ శ్రావణి దంపతులు

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ గ్రామంలో గల గుట్ట రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రాయికల్: పట్టణంలోని శివాలయం, గుడికోట చెన్న కేశవనాథ పంచముఖ లింగేశ్వర సూర్యనారాయణ ఆలయం, మండలంలోని కొత్తపేట నాగాలయం, ఇటిక్యాల, అల్లీపూర్ గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గుడికోట ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట నాగాలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున గిర్దావర్ పద్మయ్య దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని గుడికోట, మండలంలోని కొత్తపేట, ఇటిక్యాల అల్లీపూర్ గ్రామాల్లోని ఆలయాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుమారుడు రాంచంద్రారెడ్డితో కలిసి పూజలు నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొడిమ్యాల : మండలంలోని నాచుపల్లి గ్రామంలోని శివాలయంలో శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం శివపార్వతుల కల్యాణం ఆలయ కమిటీ, ప్రజల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని చెప్యాల, తిప్పయ్యపల్లి. నమిలికొండ గ్రామాలతో పాటుగా వివిధ గ్రామాల్లోని పలు ఆలయాల్లో ఉదయం నుండి భక్తులు పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. కొడిమ్యాల గుండ్రప్ప శివాలయం, మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో హిమ్మతురావుపేట, రామకిష్టాపూర్ రోడ్డుకు సమీపంలో గల శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చకులు శ్రీనివాస్, రమేష్ చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం, శ్రవణ నక్షత్రం సందర్భంగా మహాశివరాత్రి పురస్కరించుకొని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. ఆలయ పూజారి నాగరాజు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు వెంగళాయిపేటలోని రాజన్న ఆలయంలో భక్తులు వేకువ జామునుంచే దర్శించుని మొక్కులు చెల్లించుకున్నారు. పెగడపల్లి ఆలయంలో జనం తండోపతండాలుగా తరలి రావడంతో మూడు గంటలకు పైగా క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు.

కోడె మొక్కు చెల్లించుకున్న అడ్లూరి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పెగడపల్లి, వెంగళాయిపేట ఆలయాలకు రాగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలకగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ఓంకారేశ్వర ఆలయం, మార్కండేయ స్వామి, ఆరపేటతో పాటు ఆయా వార్డులలో శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆరపేట శివాలయంలో వేద పండితుల మంత్రోచ్చరణలు మధ్య శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఓంకారేశ్వర ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, వేములకుర్తి, బర్తీపూర్, మూలరాంపూర్, ఎర్దండి తదితర గ్రామాల్లోని ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఎర్దండి గ్రామంలోని శివాలయంలో భక్తులు గ్రామ శివారులోని గోదావరి నుంచి జాలాలు తీసుకువచ్చి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : పట్టణంలో శైవక్షేత్రాలు బుధవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఓం నమశ్శివాయః నామస్మరణతో మారుమోగాయి. పట్టణంలోని కోటినవ దుర్గ, మహదేవ స్వామి, నగేశ్వర స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కాగా పట్టణంలోని మహదేవ స్వామి, నగేశ్వరస్వామి దేవాలయాలల్లో శివపార్వతులకు కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ ముఖ ద్వారం నంది విగ్రహం వద్ద మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. మహదేవ స్వామి దేవాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నాడు.

మల్యాల: మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని మల్యాలతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు శివునికి అభిషేకాలు చేసి దర్శించుకున్నారు. సాయంకాలం దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

భీమారం: మండలంలోని రాజలింగంపేట గ్రామంలో శ్రీ బాల రాజేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహా శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు పూజారులు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 4 వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చారి, గంగ్ర సురేందర్ రావు, ఓలవేణి తిరుపతి, బండపెల్లి గంగరాజం, అంబటి భూమయ్య, ఉలిసె శ్రీనివాస్, ఉలిసె గంగాధర్, బండపెల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని శివాలయాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. మండలంలోని రాపల్లె, చిల్వాకూడూర్, శ్రీరాముల పల్లె, గొల్లపల్లి మండల కేంద్రం, లొత్తునూర్, లక్ష్మీపూర్, రంగదాముని పల్లె, తదితర గ్రామాల్లో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా సాగాయి. మహిళలు ఇళ్లలో జాగారాలు కాల్చి శివుడికి నైవేద్యం సమర్పించారు.

మల్లాపూర్ : మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాలలో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు శివాలయాల్లో అర్చకులు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అభిషేకం, అర్చనలు, బిల్వ పూజలను జరిపి స్వామిని వేడుకున్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని శివాలయాల్లో అర్చకులు పార్వతీ పరమేశ్వరుల కల్యాణమును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శివాలయాల్లో ఉదయం నుండే స్వామిని దర్శించుకొని అభిషేకం, అర్చనలు, తదితర ప్రత్యేకపూజలు చేపట్టారు. కాగా పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు

కథలాపూర్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లొంకరామేశ్వస్వామిని భక్తులు దర్శించుకోగా అర్చకులు గంగ, గౌరీ సమేత రాజరాజేశ్వరస్వామి కల్యాణంను నిర్వహించారు. అదేవిధంగా బొమ్మెనలో మహదేవస్వామి, దూలూరు, సిరికొండ, కలికోట, గంభీర్‌పూర్, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో భోళాశంకరుడికి నైవేద్యాలు సమర్పిచారు.

వెల్గటూర్: కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆయన కోటిలింగాల శ్రీ పార్వత కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చన, అభిషేకం నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్‌శర్మలు ఆశీర్వచనాలు అందించారు.


మొగిలిపేటలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


ధర్మపురి గోదావరి వద్ద మహిళల పూజలు


పెగడపల్లి శివాలయంలో కోడె మొక్కు చెల్లించుకుంటున్న అడ్లూరి


ఎర్దండి శివాలయలో గోదావరి జలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు


కోరుట్లలో పూజలు నిర్వహిస్తున్న జువ్వాడి నర్సింగరావు తదితరులు

వాల్మీకి ఆవాస విద్యార్థుల సంక్షేమానికి కృషి

జగిత్యాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాస నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తామని కోరుట్ల మండలం యూసూఫ్‌నగర్ గ్రామానికి చెందిన దూరిశెట్టి లక్ష్మీ నారాయణ - మంజుల దంపతులు అన్నారు. బుధవారం పట్టణంలోని దరూర్ క్యాంపులో గల వాల్మీకి ఆవాస సేవా భారతి గ్రామీణ నిరుపేద విద్యార్థుల ఆవాసాన్ని శివరాత్రి పురస్కరించుకొని సందర్శించారు. విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలువురు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అవాస ప్రముఖ్ సుద్దాల మల్లేశం, సత్య నారాయణ, గుంటుక మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కొడిమ్యాల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి):తురుక కాశీ జగిత్యాల జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మండలంలోని తురుకకాశీనగర్‌కు చెందిన షేక్ కరీంను బుధవారం జగిత్యాలలో ఎన్నుకున్నట్లు మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ చాంద్‌పాషా తెలిపారు. ఉపాధ్యక్షునిగా షేక్ హిమాంను ఎన్నుకున్నారు.

500 ఈత చెట్లు దగ్ధం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హన్‌మాన్ ఆలయ సమీపంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంలో 500 ఈత చెట్లు దగ్ధమైనట్లు గీత కార్మికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరిగిందా లేదా ఏమైనా కుట్ర ఉందా అని గౌడ కులస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

1,008 పుణ్య క్షేత్రాలు, 49 మహానదుల నీరు పంపిణీ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భారతదేశంలోని 1,008 పుణ్య క్షేత్రాలు, 49 మహా నదుల జలాలను పంపిణీ చేశారు. పట్టణంలోని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొండ జగన్ స్థానిక బిజిలి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ జలాల పంపిణీ చేశారు. గో క్షీరము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి దంపతులు, పిప్పరి అనిత, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏసీఎస్ రాజు, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కోరుట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోగల కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సీఐ సురేష్ బాబు, కరస్పాండెంట్ బారీ పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తులకు ఉచిత వాహన సౌకర్యం

ధర్మపురి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లే భక్తుల కోసం పట్టణ ఆర్య వైశ్య వర్తక సంఘాలు, మున్సిపల్ 11వ వార్డు మాజీ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ పక్షాన బుధవారం ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులను వాహనాల ద్వారా ఆలయానికి తరలించడంలో ధర్మపురి పట్టణ ఆర్యవైశ్య వర్తక, సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపల్లి రాజేందర్, మాజీ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ప్రధాన కార్యదర్శి చౌడారపు సతీష్, నిత్యాన్న సత్ర, వర్తక సంఘాల కోశాధికారి రంగ శంకరయ్య, ముత్యపు రమేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నేత జక్కు రవీందర్ తదితరులు తగు సేవలు అందించారు. ఈ సందర్భంగా వారిని సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ అభినందించారు.